33

# సుబ్బమ్మత్త శృంగారవీథి

అచ్యుతరామయ్యగారి అరుగుమీద చెంబులో పేలాలు పోసుకుని ఓ మూల కూర్చుని పరుకూ పరుకూ నముల్తూ "ఎవరా వెళ్లేది?" అని రోడ్డుమీద అలికిడి అయితే అడ్డమైన వాళ్లనీ పలకరిస్తూ, చిల్లులుపడ్డ ఆకాశంలావున్న అతుకుల బొంతను కాళ్లమీదేసుకుని కుట్టుకుంటూ "ఊర్మిళాదేవి నిద్ర" - సీత సమర్త - "లక్ష్మణ స్వామి నవ్వు"లాటి

పాతపాటలు పాడుకొనే "సుబ్బమ్మత్త" మీకు గుర్తుందీ? మనకు పెళ్లయినపుడు అరుగుమీద చింకిచాప మీద చుట్టుకుని కూర్చున్నముసలమ్మకు తీసుకెళ్ళి దండం పెట్టిస్తే మీకు రెండు ఇచ్చి రూపాయలు తీసి చేతిలో పెట్టి ముఖంమీద చేతులుపేసి తడిమిచూసి "అందగాడేనే" అంటే మీరు మరీ సిగ్గుపడిపోతే నాకు నవ్వొచ్చి పక్కుమని నవ్వేస్తే....

"అనవ్వాలు కాస్త మొగుడికోసం అట్టేపెట్టే లంజకానా" అని వెన్నుమీద చరిచింది.

తాటి ముంజెలు కొట్టుకు తిన్నట్టు. చెరకు పానకం తాగినట్టు. ఏయ్యేపురాలిజీళ్ల కొసరి కొసరి విరుసుకు తిన్నట్లుండే అతిట్లలోని సొగసు - అంటే తెలుగువారి తిట్లలోని కోటిదీవెనల సొగసు తెలుసుకోవాలంటే మచ్చుకి మా"సుబ్బమ్మత్త" లాంటి మూలనున్న ముసలమ్మలను కదిలించాలి:

టపేటాసిల్కు గౌనులు. విమానం సిల్కుపావడాలు పట్టు పరికిణీలు. గ్లాస్కోచీరలూ కట్టుకున్న పదుచు పిల్లలమంతా కాలవ కెళ్ళే దారిలో ఎత్తరుగుల మండువాలోగిల్లోకి చేరి కొబ్బరాకు బూరలుచుట్టుకుని. తాటాకుబొమ్మలకు పెళ్లిళ్లుచేసి గుజ్జనగూళ్లు వండుకుని చెంగుమని గెంతుతూ పాడుతూ కాలక్షేపం చేసేవాళ్ళం:

చెంబులాక్కుని చాపచాచేసి పాతగుడ్డల మూటను పట్టుకుపోయి. ఆవిడతో మీకేమర్రా అంటే వినిపించు కోక నానా అల్లరీ చేసి ఆవిడను కవ్వించి మరీ తిట్లు తినేవాళ్ళం:

"మీ మొహం మండా-"

"మె అమ్మకడుపు మాడ-"

"తగలెయ్య"- పిండా కూడు"

"ఛావంది" ఇలాటి దరిద్రపు తిట్లు ఆవిడ నోట వినలేము.

"ఓసి నీ యిల్లు బంగారం కానూ"

"కడుపుడక" ఇలా మొదలెట్టి సొగసైన ధోరణిలోకి దిగేది.

"ఏవేం, లంజా- నీ కెంత మందే పిల్లలూ?"

"మొగుడి కింత తిండి పెడుతున్నావా? ఆ గాడిదకొడుకుని ఏడి పించుకు తింటున్నావా?" అని. అప్పుడే కాపురానికెళ్ళి పుట్టింటికొచ్చిన కొత్త కాపురం అమ్మాయిని రెండు చేతులతోనూ వొళ్ళంతా తడిమి ఆ పిల్లకి చక్కలిగింతలయి నవ్వితే. ముసలమ్మను త్రోసేసి పారిపోబోతే-

"అలా బుగ్గలు సొట్టలు పడేలా పళ్ళు బయట పెట్టి నవ్వావో. చూస్తూండు వీధిలో ఎవడో ఎగరేసుకు పోతాడు చక్కా-"అని మందలించేది.

కొత్త కోడలయినా అంతే-వొళ్ళంతా అరి చేతులతో తడిమి ఆ పిల్ల వయ్యారాలుపోతే "ఏంవే మొగుడనుకుంటున్నావా" అని మాట విసిరి "పోండి బామ్మగారూ అంటే "లంజకానా తిన్నగా నడవ్వే-ఏవిటా కులుకు?' అని జడ పట్టుకుని గుంజేది.

కార్యంనాడు ఏ జడ వెయ్యాలో మా బామ్మగారు కచ్చితంగా చెప్పేది మొగలి పూలజడ చమ్కీలువేసి జడకుప్పెలుపెట్టి కుడితే ఆవిడ ఒప్పుకునేది కాదు

"ఇదో తిక్కది- ఆ మొగలి పూల జడతో వాడి వొళ్ళంతా గీరుకుపోదూ! అమ్మా మల్లెపూలజడ మెత్తగావుంటుంది. అవి వెయ్యండి" అని సలహా యిచ్చేది.

ఆవిడ పూలజడల స్పెషలిస్టు. ప్రతి పెళ్ళికూతురుకీ జడ వేస్తూ

నవ్విస్తూ బుజ్జగిస్తూ వీపు మీద చరుస్తూ కబుర్లు చెప్పేది. రహస్యాలు లాగి సుఖవులు అడక్కుండా చెప్పేది.

పుస్తకాలు. పత్రికలు.నవలలు, కథలూ రాక ముందు పల్లెటూళ్లో ఆడవాళ్ళ ప్రపంచం అదో శృంగార వీథిగా నిండుకనంతో ఆపేక్షలు అభిమానాలతో పరిమళించి పోయేది.

మొన్నీ మధ్య మా ఊరు వెళ్ళేను. ఆ అరుగు మీద ఆ మున లమ్మ కనబడలేదు. అరుగేమిటి మనసే కాళీగా. చికాగ్గావుంది. "సుబ్బ మ్మత్త" ఏమయిందే నయిందని అడిగాను. మీకు రెండు ఇచ్చు రూపా యలు బహూమానం ఇచ్చి. నాకు కార్యం నాడు పూల జడ వేసి వెన్ను మీద చరిచి వేళాకోళాలాడిన సుబ్బమ్మత్త చింకిచాపా, చిరుగుల బొంతా, ఇత్తడి చెంబు ఏమయాయి ఏమయాయనిపించింది నాకు.

సుబ్బమ్మత్తని కాల్లోకి తీసికెళ్ళారు.

చింకిచాపని ఏట్లో పారేశారు.

నా మనసులోని మనసులో ఆవిడ సొగసుగా తిట్టినతిట్లు వేయి పారిజాతాల పరిమళం. లక్షమల్లెపూలతావి, కోటి గులాబీల సోయగాలను విరజిమ్మాయి.

"నా దాప ఎత్తుకుపోయి కాలవలో పారేస్తావే లంజకానా. నీకు రెండు దజన్లు పుట్టుకొస్తారు. పుట్టుకొచ్చి ఆ కుర్రముండ లంతా నీకొంప పీకి, నీయిల్లు అగంచేసి నిన్నేడి పించుకు తింటారు." అని మమ్మల్ని తిట్టినట్లు అప్పుడు మేమంతా కేరింతాలుకొట్టి "సుబ్బమ్మత్త" చుట్టూచేరి తప్పట్లు చరిస్తే—చెంబులోంచి పేలాలు తీసిపెట్టి అరటిపళ్ళు వాళ్లా వీళ్లా ఇచ్చినవి మాకు పంచిపెట్టి దాచిన తన వస్తువుల్ని మళ్ళీ తెప్పించుకునేది. ఆ అరుగుమీద మేము బొమ్మలాటలు ఆడుకోవటం మానేస్తే-మాలో

కొందరు కాపరాల కెళ్లిపోతే. కొందర్ని కష్టాలువరిస్తే. కొందరిని కాలం కరిస్తే. అందర్నీ పేరు పేరు వరసలా తల్చుకుంటూ ఆవీథిలో అలికిడి అయితే 'ఎవరా వెళ్ళేది?' అని ప్రశ్నిస్తూ అరుగుమీద కూర్చున్న విగ్రహం. ఆఖరికి తినలేక. అడిగేవారు పెట్టేవారులేక, చివికిచివికి ప్రాణ ముండగానే అంతా వీథిలో పారేస్తే చెట్టుక్రింద మూడురోజులు తీసుకుని తీసుకుని గుటుక్కు-మందిట:

పూలజడలువేసి అల్లప్పచ్చడి చేసి పెట్టి ఆ వీథిలోని ఆడపిల్లలందర్నీ పేరు పేరు వరసలా పిలిచి లాలించి అభిమానించి తిట్టి చివరకు ఎవరికీ ఏమీ గాకుండా చెట్టుక్రింద కన్ను మూసిందంటే-నాగుండె ఝల్లుమంది: